

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట




అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

## జనగణన-2027

# అత్యంత ముఖ్యమైనది

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 15 ప్రభాతవార్త :** దేశంలో దాదాపు 15 ఏళ్ల తర్వాత నిర్వహించనున్న జనగణన-2027 అత్యంత ముఖ్యమైనదని, దీని ఆధారంగానే దేశ అభివృద్ధి ప్రణాళికలు రూపొందుతాయని, అందువల్ల ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జనగణన-2027 ప్రక్రియలో భాగంగా మొదటి దశగా హౌస్ లిస్టింగ్ ,హౌస్ సెన్సస్ నిర్వహణకు సంబంధించి జిల్లా చార్జ్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా చార్జ్ స్థాయి అధికారులకు మార్చి 15 నుండి 17 వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఆదివారం వనపర్తి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మొదలైన ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరై జిల్లా చార్జ్ స్థాయి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో దాదాపు 15 ఏళ్ళ తర్వాత నిర్వహించ తలపెట్టిన జనగణన 2027 ప్రక్రియ అత్యంత ముఖ్యమైనదని చెప్పారు. ఈ ప్రక్రియ ఆధారంగా దేశంలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించబడతాయని, నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అందువల్ల అధికారులు ఎలాంటి పొరపాట్లు లేకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ప్రతి ఇంటిని ఖచ్చితంగా గుర్తించి గృహాల వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని చెప్పారు. జనగణన కోసం బ్లాక్ లను గుర్తించడం, ఎన్యూమరేటర్ లను అపాయింట్ చేయడం జిల్లా చార్జ్ అధికారుల బాధ్యత అన్నారు. శిక్షణ మాన్యువల్‌ను పూర్తిగా అధ్యయనం చేసి, ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇవ్వడానికి ముందు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జనగణన ప్రక్రియలో ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా దేశ అభివృద్ధికి ఇది కీలకంగా మారుతుందని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసిన తర్వాతే బ్లాక్ లిస్టింగ్ చేయాలని సూచించారు. ఈ విషయంలో నిరక్ష ్యం చేయడానికి వీలు లేదని చెప్పారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సిపిఓ హరికృష్ణ, డీఈవో అబ్దుల్ ఘని, డిఐఈఓ అంజయ్య, డిఎఫ్ ఓ లక్ష్మప్ప, డీఎస్ఓ శ్రీనివాసులు , తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# అల్లా దీవెనలు అందరిపై ఉండాలి

- ముస్లిం సోదర సోదరీమణుల కఠోర ఉపవాస దీక్షలు ఫలించాలి
- ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలు
- ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి

3



ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



వట్టిపోయిన కృష్ణానది

# వట్టిపోయిన కృష్ణమ్మ..

- కొల్పూర్ లిఫ్ట్‌బికు అందని సాగునీరు
- ఈ సీజన్లో దాదాపు రెండువేల ఎకరాల వరి సాగు
- పొట్టతో ఉన్న పంట.. దిక్కుతోచని స్థితిలో రైతులు
- ఎగువన ఉన్న ప్రాజెక్టు నుండి నీరు విడుదల చేయించాలని రైతన్నల వేడుకోలు

**మాగనూర్, మార్చి 15 ప్రభాతవార్త :** నదిలో నీరు లేక కృష్ణమ్మ ఒట్టిపోయింది. నిండుకుండలా ప్రవహిస్తూ రైతులకు నేనున్నానంటూ ధైర్యం ఇస్తూ పంటల సాగుకు తోడ్పాటునిస్తున్న కృష్ణానది బోసిపో యింది. రాళ్లురప్పలతో కలతప్పింది. నారాయణపేట జిల్లా మాగనూర్ మండలం కోల్పూర్ లిఫ్ట్‌బి ఎత్తిపోతల పథకానికి తాగునీరు అందడం లేదు. లిఫ్టును ఆసరాగా చేసుకుని ఈ సంవత్సరం యాసంగి సీజన్లో కోల్పూర్, పుంజనూర్, గజరం దొడ్డి, పర్మన్ దొడ్డి, మందిపల్లి గ్రామాల రైతులు దాదాపు రెండు వేల ఎకరాలు వరి సాగు చేశారు. ఎండ తీవ్రతకు పంట చేతికి రాకముందే కృష్ణానది జలాలు అడుగంటిపోయా యి. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉందని, పంట కోతకు రావడానికి నెలరోజులు పడుతుందని రైతులు చెబుతున్నారు. నదిలో నీరు లేకపోవ డంతో ఏమి చేయాలో తోచని స్థితిలో సహాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఎగువన ఉన్న డ్యామ్ నుండి నీరు విడుదల చేయించి, తమను ఆదుకోవాలని రైతులు ప్రాధేయ పడుతున్నారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి కర్ణాటక అధికారులతో మాట్లాడి నారాయణపూర్ డ్యాం నుండి నీటి విడుదలకు ప్రత్యేక చొరవ తీసుకొని రైతులను ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

**చివరి దశలో పంటలు.. ఆందోళనలో రైతులు...**

యాసంగి పంట చివరి దశలో ఉంది. కానీ రైతులకు పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. భూమిని నమ్ముకుని లక్షల్లో అప్పులు చేసి పంటను కంటికి రెప్పల రైతులు కాపాడుకున్నారు. కానీ వారి కష్టనికి ప్రతిఫలం లభించకుండా నష్టలపాలు అవుతామోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉందని, నెల రోజులు అయితే పంట చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు. నదిలో నీరు రాకపోతే పంటలు ఎండడం తప్ప ప్రత్యామ్నయ మార్గాలు లేవని వాపోతున్నారు. కరుణించి ఎగువ నుండి నీరు విడుదల చేస్తే కానీ తమ పంటలను కాపాడుకోలేమని రైతులు మదన పడుతున్నారు.

**డ్యాం నీళ్లు వస్తేనే... పంట చేతికి..**

కర్ణాటక రాష్ట్రం ఎగువన ఉన్న నారాయణపూర్ డ్యాం నుండి దిగువకు నీరు విడుదల చేస్తేనే ప్రస్తుతం వరి పంట చేతికి వస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. నదిలో నీరు లేక మోటార్లకు నీరు అందడం లేదని చెబుతున్నారు. నీరు రాకపోతే వరి పంటలు పశువుల మేతగా మరే అవకాశం ఉందని అంటున్నారు. రైతుల క్షేమం కోరే ప్రజా ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వం, అధికారులతో మాట్లాడి వరి పంటకు నెలరోజులు సరిపడా నీటిని డ్యాం నుండి విడుదలకు చర్యలు చేపట్టాలని రైతన్నలు కోరుతున్నారు.

**కష్టకాలంలో ఉన్న రైతులను ఆదుకోండి...**



**కె.వి నరసింహ, రైతు కొల్పూర్**

ఎగువ నుండి నదికి నీరు వస్తే గాని పంట పండే పరిస్థితి లేదు.కర్ణాటక లో ఉన్నది ప్రజా ప్రభుత్వ మే కాబట్టి మంత్రి వాకిటి శ్రీహరి నారాయణపూర్ డ్యాం నుండి ఈ పంటకు సరిపడా సాగునీరు విడుదల చేయించి రైతులను ఆదుకోవాలి. రైతులు కష్టాల్లో ఉంటే ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని నమ్ముతున్నాం.

**అప్పుచేసి వరి వేసిన....**



**నర్సిములు, రైతు కోల్పూర్ గ్రామం**

లిఫ్ట్ నీళ్లపై ఆధారపడి ఎనిమిది ఎకరాలు వరి పొలం సాగు చేసిన. పెట్టుబడి కోసం బయట వడ్డీ లెక్కన తెచ్చి ఇప్పటివరకు పంటకు మూడు లక్షలు ఖర్చు చేసిన. ప్రస్తుతం సాగునీరు నదిలో అందుబాటులో లేదు. పంట ఎండితే అప్పు కట్టలేని పరిస్థితి.ప్రభుత్వం స్పందించి పైనుండి నీటిని విడిపించి నా పంటను కాపాడాలని కోరుతున్నా.

**మూడో కోట మందు వేయలేదు...**



**సదాశివ, రైతు మందిపల్లి గ్రామం**

ఇప్పటివరకు రెండుసార్లు మందు వేసిన. మూడో కోట మందు వేయాల్సి ఉంది. ఎరువులను కొనుగో లు చేసి ఇంట్లో నిల్వచేసిన. మందు వేద్దామంటే పొలంలో నీళ్లు లేవు. నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియదు. 15 ఎకరాలలో వరి సాగు చేస్తే, ఇప్పటికే ఐదు లక్షలు పెట్టుబడి పెట్టిన, నదిలో నీళ్లు రాకపోతే పంట చేతికి రాక మా కుటుంబం అప్పుల పాలవుతుంది. మా కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం తక్షణమే రైతులకు నీళ్లను అందించాలి.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల త్వరలోనే పూర్తి చేస్తాం
- ఉదండాపూర్ పరిహారం పెంపులో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాత్ర కీలకం
- రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖా మంత్రి వాకిటి శ్రీ హరి
- జడ్చర్ల ఏరియా ఆసుపత్రి ఫ్లోరింగ్ క్లీనింగ్ చేసిన మంత్రి పాల్గొన్న శాసన సభ్యులు జె.అనిరుధ్ రెడ్డి, కలెక్టర్ ఖుష్బూ గుప్తా



ఫ్లోర్ క్లీన్ చేస్తున్న మంత్రి శ్రీహరి చిత్రంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, మార్చి 15 ప్రభాతవార్త:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య,క్రీడలుయువజన సర్వీసుల శాఖా మంత్రి వాకి టి శ్రీహరి సూచించారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచ ణలో భాగంగా రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ, క్రీడలు, యువజన సర్వీ సుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదివారం జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో జడ్చర్ల శాసన సభ్యులు జె. అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను అధికారులతో సమీక్షి ంచారు. ప్రతి నెల ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి? ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు ఎలా ఉన్నాయి? అనే విషయాలు వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, మంత్రి పారిశుధ్య కార్మికులతో కలిసి ఆసుపత్రిలో ఫ్లోర్‌ను శుభ్ర పరిచారు. ఆసుపత్రి భవనం, పరిసరాలను ప్రతినిత్యం శుభ్రంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు.అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లోని పేద, అణగారిన వర్గాలకు చేరేలా చేయడమే లక్ష్యంగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, రోడ్డు భద్రత, మహిళా, శిశు సంక్షేమం, యువజన అభివృద్ధి, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ వంటి పది ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. గత రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అనేక పనులను గురించి వివరించారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడం,సన్న రక ధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వడం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యు త్ అందించడం వంటి హామీలను ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం అనేక కార్యక్రమా లు చేపట్టినట్లు చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళ సంఘాల కు పెట్రోల్ బంకులు కేటాయించడం, ఆర్టీసీ బస్సులు ఇచ్చి యజమాను లుగా ప్రోత్సహించడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇందిరమ్మ గృహ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో మహిళల పేరుపై 3,600 ఇండ్లు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు బీమా సౌకర్యం కల్పించామని, సభ్యురాలు మరణిస్తే ఆమె తీసుకున్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుందని చెప్పారు. రాష్ట్రం లో కనీసం ఒక కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందినవారు కావడంతో జిల్లాభివృద్ధికి ప్రత్యేక నిధులు అందించేం దుకు సిద్ధంగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం – మిగతా3లో..



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీహరి

# మిస్టరీగా మారిన వ్యక్తి మృతి

### గుర్తుతెలియని మృతదేహం కలకలం..

### వివరాలు తెలిసిన వెంటనే సమాచారం ఇవ్వండి

**దేవరకద్ర, మార్చి 15 ప్రభాతవార్త :** దేవరకద్ర మండలం డోకూరు గ్రామ శివారులోని తపోవన్ పాఠశాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు ఓ వ్యక్తి చనిపోయి పడి ఉన్న అనుమానాస్పద స్థితిలో మృతదేహం కనిపించడంతో గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దేవరకద్ర పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఎటువంటి గుర్తింపు ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండొచ్చని, ఆయన పసుపు డబ్బాల చొక్కా, నీలి రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు గుర్తించారు. మృతుడు సుమారు 15 రోజుల క్రితమే మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మృతుడిని ఎవరైనా గుర్తిస్తే లేదా అతని గురించి ఎవరైనా సమాచారం తెలిసి ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని దేవరకద్ర ఎస్సై నాగన్న సోషల్ మీడియా ద్వారా ప్రజలను కోరారు.ఈ ఘటనపై గ్రామ కార్యదర్శి రాఘవేంద్రరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

## గ్రామీణ స్థాయి నుంచి

# క్రీడాకారులకు ప్రోత్సాహం

### ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవంలో పాల్గొనండి

### 25 వ డివిజన్ కార్పొరేటర్ పాండు రంగారెడ్డి

### రైతులను మోసం చేసింది కాంగ్రెస్

**మహబూబ్‌నగర్, మార్చి 15 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన రైతు బంధు పేరును మార్చి రైతు భరోసా పేరుతో ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి మోసం చేసిందని మహబూబ్‌నగర్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ పాం డు రంగారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డారు.ఇప్పటికీ నాలుగు విడుదల రైతు భరోసా ఇవ్వాల్సి ఉండగా రెండు మాత్రం ఇచ్చి రెండు విడుదలను ఎగుర గొట్టిందని ఆరోపించారు. మహి ళలకు నెలకు రూ.2500లు ఇస్తానని చెప్పి ఈరోజు వరకు ఒక్క మహిళ కు కూడా ఇవ్వలేదని,వృద్ధులకు రూ.4000ల పెన్షన్ – మిగతా3లో..

# హిందువులు సంఘటితం కావాలి

### హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి..

### సనాతన ధర్మానికి విదేశాల్లో ఆదరణ

### భువనేశ్వరి పీఠం పీఠాధిపతి

### శ్రీ కమలానంద భారతి స్వామి



ప్రసంగిస్తున్న శ్రీ కమలానంద భారతి స్వామి



సమ్మేళనానికి హాజరైన ప్రజలు

**బిజినేపల్లి, మార్చి 15 ప్రభాతవార్త:** హిందువులందరూ సంఘటితమైతే భారతదేశానికి తిరుగుండదని కమలా నంద భారతీ స్వామి అన్నారు. పాలెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళనం నిర్వ హించారు. ముందుగా కమలానంద భారతీ స్వామిజీ ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ భారతదేశం వేదభూమిలో జన్మించడం అంటే ఎన్నో జ న్మలపుణ్యం కలిగి ఉండాలన్నారు.4వేల సంవత్సరాల నుంచి విదేశీయులు భారతదేశంపై దాడిచేసి పరిపాలిం చినా హిందూ సంస్కృతి చెక్కుచెదరలేదంటే హిందూ సమాజం ఎంత గొప్పదో గుర్తుంచు కోవాలన్నారు. ప్ర పంచంలో భారతదేశ సంస్కృతి మాత్రమే నిలబడింద న్నారు. హిందూ అంటేనే నాగరికత అని తెలిపారు. హిందువులు భిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శిస్తారని, హిం దూత్వం ప్రకృతితో ముడిపడి వుందన్నారు.చెట్టు, పుట్ట, జంతువులను పూజించే గుణం హిందువుల్లో వుందన్నా రు. భూమిపై వున్న సమస్త జీవరాశులు దేవుని ప్రతి రూపాలని స్వామీజీ అన్నారు. మన దేవాలయాలతో మన బంధం విడదీయరానిది. దేవాలయాలు కేవలం నిర్మాణాలు మాత్రమే కాదని అవి మన నాగరికతకు ఆత్మ అని నేటి తరానికి మనం గుర్తు చేయాలన్నారు. హిందువులంతా సంఘటితమైతే సమీప భవిష్యత్‌లో భారత్ విశ్వగురుస్థానంతో పూర్వవైభవాన్ని సంతరించు కోవడం ఖాయమన్నారు.

**ప్రతి ఒక్కరిలోనూ దైవం కొలువుంటుందన్నారు.**

దుర్గుణాలను వదిలి, సన్మార్గంలో నడిచినప్పుడు ఆధ్యా త్మికత పెంపొందుతుందన్నారు. గృహాశ్రమం కలిగిన ధర్మశాస్త్రం ఆచరిస్తున్న జాతి హిందూ జాతి అన్నారు. రామాయణం, మహాభారతం ప్రవచనాలు చేసి సనాతన సంప్రదాయాల విశిష్టతను వివరించారు.భారతసంస్కృతీ సంప్రదాయాలు గొప్పదనాన్ని మరువొద్దన్నారు. భారత సనాతన సంప్రదాయాన్ని పాశ్చాత్య దేశాల్లో చాటి చె ప్పిన మహోన్నత వ్యక్తి వివేకానందుడని,ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భారత సనాతన ధర్మానికి విదేశాల్లోనూ విశేషస్పందన ఉందని, హిందూధర్మం స్వీకరించి పాటిస్తున్నారని వివరించారు. ఈ ధర్మం గొప్పతనమే కలిసి బ్రతకడం బ్రతకనివ్వడం అందుకే ఈ దేశంలోకి వచ్చినా పర ధర్మాలను కూడా ఆహ్వానించి ఆదరించి ఆశ్రయమిచ్చిన ఔన్నత్యం కనబ డుతుంది అన్నారు. హిందూ సమ్మేళనం సభ ద్వారా మరోసారి పౌరుల్లో ప్రేరణాశక్తిని రగిలించినట్లయ్యింద న్నారు. హిందువులు సనాతన ధర్మంతోపాటు ఐక్యమ త్యం పాటించాలని, హిందు ధర్మ పరిరక్షణలో భాగస్వా మ్యులు కావాలని భవనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వామి పిలుపునిచ్చారు. ఊరేగింపుగా సభ వద్ద కు తీసుకు వచ్చారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రాంత కార్యకారిణి సభ్యులు అన్నదానం సుబ్రహ్మణ్యం గారుమాట్లాడుతూ సనాతన హిందూధర్మం,వేదసంస్కృ తి, సంప్రదాయాలను పరిరక్షించాలని, సమాజంలో సమతుల్యత, ఐక్యతను పెంపొందించడం ద్వారా హిం దూ సంస్కృతి గొప్పతనాన్ని, చారిత్రక ప్రాధాన్యతను నేటి తరానికి తెలియజేయాలన్నారు.ప్రపంచం బాగుం డాలని, అన్ని దేశాలు బాగుండాలని, మన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. సమాజంలోని ఆర్థిక, విద్యా, వైద్య, వంటి పలురంగాల్లో సేవలను అందిస్తూ ఆర్ఎస్ఎస్ నిరంతర కృషి చేస్తోందని పేర్కొన్నారు. స్వార్థాన్ని వదిలి ధర్మం, సమాజ రక్షణ కోసం పనిచేయడం ప్రతీ హిందువు ధర్మమని చెప్పారు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో హిందు వులపై హింసాత్మక చర్యలు జరుగుతున్నాయని, హిం దువులను విడదీసేప్రయత్నాలు,మత మార్పిడి చర్యలు, యువతను వ్యసనాలకు దారి తీసే కుట్రలు జరుగుతు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కులభేదాలు లేని హిందూసమాజం నిర్మాణం కావాలని కోరారు. హిందూ ధర్మం హిందూ సంస్కృతిని పరిరక్షిస్తూ,దేశం ఉన్నతిని సాధించడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. విభాగ్ సంఘ చాలక్ ఏం రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవంలో భాగంగా ప్రతీ గ్రామంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యులను తయారు చేయాలన్నారు. సంఘ వికాసంతో పాటు దేశ అంతర్గత వ్యతిరేక శక్తుల ను అధిగమించి ప్రపంచ దేశాల్లోని హిందువులను సం ఘటితం చేస్తు అతి పెద్ద స్వచ్ఛంద సంస్థగా నిలబడిం దని అన్నారు.స్వాతంత్రం వచ్చాక ప్రపంచంలో మళ్ళీ మన పవిత్ర మాతృభూమిని మళ్లీ విశ్వగురు స్థానంలో ప్రతిష్టించడానికి సన్నద్ధం కావాలన్నారు. సమాజ పరివర్తన కోసం సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, స్వ ఆధారిత జీవనం, పౌరవిధుల ఆచరణ, కుటుంబ ప్రబోధన్ భాగస్వాములను చేయడానికి చురుకుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జున్నా శేఖర్ రెడ్డి దంపతులు భోజన వసతి కల్పించారు. హిందూ సమ్మేళనంలో సర్పంచ్ బోనాసి రామకృష్ణ ఉత్సవ సమితి అధ్యక్షులు వస్పర్శివుడు ప్రధాన కార్యదర్శి జగదీష్ ఉత్సవ సమితి కన్వీనర్ జాకీర్ హుస్సేన్, డా.గోపాల్, విష్ణుమూర్తి, గాడి శశికళ సురేందర్, మధుసూదన్, పాలెం ఉపఖండ పరిధిలోని గ్రామాల ప్రజలు , ఆయా గ్రామాల సర్పంచులు ,రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన జీపీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**భూత్పూర్,మార్చి 15,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం తాటికొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) ప్రారంభించారు.ఇదే గ్రామంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో నిర్మించిన పోనమోని కృష్ణమ్మ ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు.గ్రామంలోని వీరభద్రగుడికి గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్‌ను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,పోతులమడుగు సర్పంచి ఆనంద్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు ఎర్రవాపు నర్సింహులు, రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి,సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి వాస్తుపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

## దివ్యాంగులకు ఉచిత శిక్షణ

**ఆత్మకూర్ మార్చ్ 15, ప్రభాతవార్త;**ఆత్మకూరు పట్టణంలోని లిటిల్ పవర్ కోచింగ్ సెంటర్లో వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి దివ్యాంగులు, అనాథ పిల్లలకు గురుకుల, నవోదయ, సైనిక్ స్కూల్ లలో ప్రవేశాలు పొందేందుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లుగా కోచింగ్ సెంటర్ అకాడమీ కట్ వైజర్ మీర్జా అన్వర్ బేగ్ ప్రభాతవార్తకు తెలిపారు. 2026/ 2027 విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ మూడవ తేదీ నుండి 2027 ఫిబ్రవరి వరకు నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షలు రాసే 4వ తరగతి, 5వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనట్లుగా ఆయన తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్, వనపర్తి పట్టణంలో గల అక్షర స్కూల్ నందు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకోవాల్సిందిగా ఆయన తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్

**ఆత్మకూర్ మార్చి 15, ప్రభాతవార్త;** మున్సిపల్ కేంద్రమైన ఆత్మ కూరు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రోజు ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు తదితరులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన 1999, 2000 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఏర్పాటు చేసినటువంటి చలివేంద్రం ను మున్సిపల్ చైర్మన్ ప్రారం భించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో పూర్వపు విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. వేసవికాలంలో పేదల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం లాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందించదగ్గ విషయమని వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు తోట రవి, బోయ రాజు, పిన్నంచర్ల రఘు తదితరులతో పాటుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్, దామోదర్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ నాగమణి

## కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం

### సమైక్య భవనానికి స్థలం దానం చేసిన రాఘవేందర్ రెడ్డి

**నవాబుపేట, మార్చి 15 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యత వహిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు నిస్తుందని కొండాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్ రాఘవేందర్ అన్నారు. ఆదివారం కొండాపూర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డి తన సొంత స్థలాన్ని గ్రామ మహిళల అభ్యున్నతి కోసం తన సొంత భూమిని మహిళా సమైక్య భవనానికి కేటాయించారు. రాఘవేందర్ రెడ్డికి గ్రామస్తులు మహిళా సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సమైక్య భవనము కేంద్ర ప్రభుత్వ ఎన్ఆర్ఈజీఎస్ నిధులనుండి మహిళా సమైక్య భవనానికి గ్రామ సర్పంచ్ కొత్త గొల్ల రాఘవేందర్, గ్రామ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకుల సమక్షంలో శంకుస్థాపన చేయడం జరిగింది. భవన శంకుస్థాపన కార్యక్రమంలో కొండాపూర్ గ్రామ సర్పంచ్ కొత్తగొల్ల రాఘవేందర్, డిప్యూటీ సర్పంచ్ బాలరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఉన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

## చెన్నారెడ్డి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**మక్తల్ టౌన్, మార్చి 15 ప్రభాతవార్త :** మక్తల్ పరిధిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన దండు చెన్నారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, వారి లో భరోసా నింపేందుకు పాత మిత్రు లు మానవత్వాన్ని చాటుకున్నారు. 2004, 05 ఎస్ఎస్సి బ్యాచ్‌కు చెంది న చెన్నారెడ్డి అకాల మరణం వారి స్నేహితులను తీవ్రంగా కలిచివేసింది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుం బాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో అదే బ్యాచ్‌కు చెందిన మిత్రులంతా స్వచ్ఛం దంగా ముందుకు వచ్చారు. ఈ క్రమంలో మరణించిన మిత్రుని నివాసానికి చేరుకున్న స్నేహితులు, బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి ధైర్యం చెప్పారు.అనంతరం తమ వంతు సహాయంగా సేకరించిన రూ. 50వేలు నగదును చెన్నారెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో అండగా నిలిచిన స్నేహితుల చొరవను పలువురు అభినందించారు. స్నేహం అంటే కేవలం సరదాగా గడపడమే కాదని, కష్టాల్లో ఉన్నప్పుడు ఒకరికొకరు తోడుగా నిలవడమే నిజమైన బంధమని వారు ఈ సందర్భంగా వారి పదవ తరగతి బృందం చాటిచెప్పారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న మిత్ర బృందం

## మన్నే జీవన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

**దేవరకద్ర,మార్చి15 ప్రభాతవార్త:**హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీగా ఎన్నికైన మన్నె జీవన్ రెడ్డిని, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన్నె జీవన్‌రెడ్డి సెక్రటరీగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, క్రికెట్ అభివృద్ధికి ఆయన సమర్థవంతంగా పని చేస్తానని ఆకాంక్షించారు. అలాగే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో క్రికెట్ క్రీడా మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ఎంతో నైపుణ్యత కలిగిన యువ క్రికెటర్లు ఉన్నారని, వారిలోని నైపుణ్యతను వెలికి తీసి, వారికి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని జీవన్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. అనంతరం మన్నె జీవన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి, పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**దేవరకద్ర, మార్చి 15 ప్రభాతవార్త :** దేవరకద్ర మండలం జీనుగురాల గ్రామానికి చెందిన తిప్ప మణెమ్మ అనారోగ్యంతో సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జీనుగురాల సర్పంచ్ నాగమ్మ సాయిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5000లు ఆర్థిక సాయం అందజేశారు. మణెమ్మ భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా నాలుగో వార్డు లక్ష్మీనారాయణ, పదో వార్డ్ గొల్లదాసు, ఇతరులు కలిసి రూ. 5500 జమచేసి వారి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



### నేటి నుండి అన్నాసాగర్‌లో వైభవంగా

## శ్రీ పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్టాపన

**దామరగిద్ద,మార్చి 15 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం అన్నాసాగర్ గ్రామంలో నిర్మించిన నూతన శ్రీ పోతురాజు స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు నేటి నుండి అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి.సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తెలిపారు. జిల్లాలోనే అరుదైన దేవాలయంగా నిలిచే ఈ ఆలయ మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు.సోమవారం ఉదయం 7:30 గంటలకు గణపతి–గౌరీ పూజ, ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 5 గంటలకు వినాయకుడు, శివుడు, పోతురాజు స్వామి, నాభిశిల (బొడ్రాయి), నాగదేవతల విగ్రహాలను పురవీధుల గుండా వైభవంగా ఊరేగించనున్నారు. అనంతరం లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, మహా మంగళహారతి నిర్వహిస్తారు.మంగళవారం ఉదయం రుద్ర హోమం,నారాయణ సూక్త హోమం, మండల పూజలు జరుగుతాయి. సాయంత్రం లక్ష్మీ, దుర్గ, సరస్వతి, చండీ హోమాలు, జల–ఫల–పుష్పాధివాసం వంటి విశేష పూజలు నిర్వహించనున్నారు. ముగింపు రోజైన బుధవారం ఉదయం 9:10 గంటలకు యంత్ర స్థాపన, 9:18 గంటలకు విగ్రహ స్థాపన పూజ, ప్రాణ ప్రతిష్ఠ, అలంకార దర్శనం, పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరుగనున్నాయి.ఈ మహోత్సవాలకు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ సిద్ధలింగ మహాస్వామి వారు విచ్చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేయనున్నారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఉమ్మడి జిల్లాలోనే అరుదైన ఈ దేవాలయ మహోత్సవాలకు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.



శ్రీ పోతురాజు స్వామి దేవాలయం

## వృద్ధుడిపై దాడి ఘటన.. ఇంటి దగ్గరికి వెళ్లి కేసు నమోదు

**మహబూబ్‌నగర్,మార్చి15 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణంలోని హబీబ్‌నగర్ ప్రాంతంలో వృద్ధుడిపై జరిగిన దాడి ఘటనపై వన్‌టౌన్ పోలీసులు వెంటనే స్పందించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,హబీబ్‌నగర్ ప్రాంతానికి చెందిన మొహమ్మద్ అబ్దుల్ వహీద్ (72), రిటైర్డ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కొంతమంది వ్యక్తులు ముందుగా ప్రణాళిక ప్రకారం అతని ఇంటి వద్దకు చేరుకుని అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో పాత వివాదాలను మనసులో పెట్టుకుని బాధితుడిని దూషిస్తూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రకారం ఈ ఘటనలో యూసుఫ్, షంషుద్దీన్, ఆసిఫ్ (యూసుఫ్ సోదరుడు), షాద్‌జిల్, షేక్ ఉమర్, అలాగే యూసుఫ్ భార్య, ఆసిఫ్ భార్య, యూసుఫ్ సోదరి, యూసుఫ్ మామగారు మొయినుద్దీన్ కలిసి బాధితుడి ఇంటి వద్దకు చేరుకుని బెదిరింపు పరిస్థితిని సృష్టించినట్లు తెలిపారు. కొందరు వ్యక్తులు చేతుల్లో కర్రలు, ఇతర పరికరాలు పట్టుకుని ఉండగా, వారు బాధితుడి ప్రాణం, ఆస్తికి భయం కలిగించే విధంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతమంది వ్యక్తులు సీసీ టీవీ కెమెరాల్లో కనిపించకుండా కొంత దూరంలో నిలబడి ఉన్నప్పటికీ, మొత్తం ఘటనలో వారు కూడా భాగస్వాములుగా ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించి, బాధితుడి ఫిర్యాదు ఆధారంగా క్రైమ్ నంబర్ 66/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



వృద్ధుడు ఇంటి వద్ద కేసు వివరాలు నమోదు చేస్తున్న వన్‌టౌన్ సిఐ అప్పయ్య

## చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకై విరాళాల సేకరణ

**నారాయణపేట, మార్చి 15 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు కోసం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని పళ్ళ పోల్కమ్మ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య స్థాపకుడు, ధర్మ రక్షకుడు అయిన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని నారాయణపేటలో ఏర్పాటు చేయడం గర్వకారణమని తెలిపారు. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విగ్రహ ఏర్పాటు కోసం సహకరించాలని పిలుపునిచ్చారు. విరాళాల సేకరణ ప్రారంభ సందర్భంగా జి. కురుమన్న, జి. శేషు యాదవ్, శ్రీపాద్ కులకర్ణి ఒక్కొక్కరు రూ.1 లక్ష చొప్పున విరాళం అందించారు. సంకలపురం మల్లేష్ రూ.51 వేల విరాళం అందించగా, భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల చెక్ అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహేష్, ఆర్ఎస్ఎస్ నాయకులు డా.మదన్‌మోహన్ రెడ్డి, రఘురామయ్య గౌడ్, కన్న శివకుమార్, పళ్ళ రఘు, పావడి మహదేవ్, హోటల్ నవీన్, మణిశంకర్, జుట్టు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



విరాళాల సేకరణ చేస్తున్న దృశ్యం

## మజీద్ అభివృద్ధికి కేవైసీ ట్రస్ట్ నుంచి రూ.3 లక్షల విరాళం

**ఉప్పునుంతల, మార్చి 15 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మజీద్ ఏ.యూసుఫ్ అభివృద్ధికి కేవైసీ (కిద్మత్ యూత్ కరేజ్) ట్రస్ట్ సభ్యులు రూ.3 లక్షల విరాళాన్ని అందజేశారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కేవైసీ ట్రస్ట్, మసీదు అభివృద్ధి కోసం ముందుకు రావడం స్థానికంగా అభినందనీయంగా మారింది. కొద్ది రోజుల క్రితం ట్రస్ట్ సభ్యులు ఇమ్రాన్ ఖాన్, షేక్ చాంద్ పాషా తదితరులు మజీద్ ఏ.యూసుఫ్‌ను సందర్శించారు. ఆ సందర్భంగా మసీదులోని ఉజు ఖానా, మరుగుదొడ్లు, తహరత్ ఖానా తదితర సౌకర్యాలు దెబ్బతిన్న స్థితిలోఉండటాన్నివారుగమనించారు. మసీదు పరిసరాల్లో నెలకొన్న ఈసమస్యలనుపరిష్కరించేందుకు కేవైసీ ట్రస్ట్ ముందడుగు వేసింది. ఈ నేపథ్యంలో ట్రస్ట్ సభ్యులు తమ కేవైసీ ట్రస్ట్ తరఫున ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సహాయం కోసం ప్రజలను అభ్యర్థించారు. సోషల్ మీడియా ద్వారా వచ్చిన విరాళాలతో పాటు ట్రస్ట్ తరఫున మరికొంత నిధిని జత చేసి మొత్తం రూ.3 లక్షలను మజీద్ కమిటీకి అందజేశారు. ఈ మొత్తాన్ని మజీద్ కమిటీ ఆధ్వర్యంలో అబ్దుల్ గఫార్‌కు అందజేయడం జరిగింది. మసీదు అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను వినియోగించేందుకు మజీద్ కమిటీ సభ్యులు ఇటీవల సమావేశమై చేపట్టాల్సిన పనులపై చర్చించారు. రంజాన్ మాసం అనంతరం మరోసారి సమావేశమై అభివృద్ధి పనులపై తుది నిర్ణయం తీసుకుని పనులను ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవైసీ ట్రస్ట్ చైర్మన్ ఇమ్రాన్ ఖాన్, షేక్‌చాంద్ పాషా అబ్దుల్ గఫార్, మన్సూర్ ఖాన్, వార్డు సభ్యులు ఎం.డి. ఉస్మాన్, బషీర్, సయ్యద్ వసీం, బాబా, మోసిన్ తదితరులు పాల్గొన్నారు. మసీదు అభివృద్ధి కోసం ట్రస్ట్ చేసిన సహాయం స్థానిక ప్రజలు ప్రశంసిస్తున్నారు.




ఉప్పునుంతల మజీద్ అభివృద్ధి కి విరాళం అందజేత

## విశ్రాంత ఉపాధ్యాయుడు అబ్దుల్ గఫార్‌కు సన్మానం

### మాతృభాష ఉర్దూ.. తెలుగులో కవిత్వం

**ఉప్పునుంతల, మార్చి 15 ప్రభాతవార్త :** సామాన్య కుటుంబంలోజన్మించిన విశ్రాంత ఉపాధ్యాయుడు అబ్దుల్ గఫార్ తనమాతృ భాష ఉర్దూ అయినప్పటికీ తెలుగు భాషలో కవిత్వం రాస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. దాదాపు 30 సంవత్సరాలకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించిన ఆయన విద్యార్థులకు విద్యను బోధించడమే కాకుండా సమాజాన్ని చైతన్యపరిచే లక్ష్యంతో సాహిత్య సృష్టిలోనూ కొనసాగుతున్నారు. మహ్మద్ ప్రవక్త బోధించిన ఇస్లాం సూత్రాలను పాటిస్తూ అబ్దుల్ గఫార్ నిత్యం ఐదుపూటల నమాజ్ ఆచరిస్తూ ధార్మిక విలువలను పాటిస్తున్నారు. ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అనుసరించడంతో పాటు మరో వైపు సమాజానికి ఉపయోగపడే సాహిత్య రచనలకు సమయం కేటాయిస్తూ సాహిత్య సేవలను కొనసాగించడం విశేషం. గ్రామీణ నేపథ్యంతో పెరిగిన అబ్దుల్ గఫార్ చిన్ననాటి నుంచే పుస్తక పఠనం, కవితలు, గేయాలపై ప్రత్యేక అభిరుచి పెంచుకున్నారు. సమాజంలో ఉన్న అనేక సమస్యలను తన కవితల ద్వారా ప్రతిబింబిస్తూ సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కనిపించే సామాజిక దురాచారాలు, మూఢ నమ్మకాలు, మద్యపానం వంటి సమస్యలపై ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా ఆయన కవితలు రచించడం విశేషం.2007 సంవత్సరంలో చైతన్య దీపిక కవితా సంకలనంతో సాహిత్య ప్రపంచంలోకి ప్రవేశించిన అబ్దుల్ గఫార్, ఆ తర్వాత కూడా తన రచనా ప్రయాణాన్ని ఆపకుండా కొనసాగించారు. నల్లమల్ల రత్నాలు ప్రజాప్రస్థానం జీవన నాదం మేలుకొలుపు కాల గమనం వంటి పుస్తకాలను ప్రచురించి సాహిత్యాభిమానులను ఆకట్టుకున్నారు. సామాజిక బాధ్యతను ప్రతిబింబించే ఆయన కవితలు సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యే సరళమైన భాషలో ఉండటం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.ప్రజాస్వామ్యం, ఓటు విలువ, ప్రపంచ ఆధిపత్యం కోసం దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాల వంటి అంశాలను కూడా ఆయన తన కవితలలో ప్రతిబింబించారు. దేశభక్తి భావాలను ప్రేరేపించే అనేక రచనలతో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.సమాజంలో ఉన్న సమస్యలపై తన కలం ద్వారా పోరాటం కొనసాగిస్తూప్రజల్లోచైతన్యంకలిగించేందుకు చేస్తున్న కృషిని సాహితీలోకంహర్షిస్తూప్రశంసిస్తోంది.సామాజిక బాధ్యతతో కూడిన ఆయన రచనలు పాఠకులను ఆలోచింపజేస్తున్నాయి. 2012లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని తన కవితల ద్వారా సభికులను ఆకట్టుకున్న అబ్దుల్ గఫార్‌కు ఆ సందర్భంగా అవార్డు లభించింది. అలాగే విద్యారంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కూడా ఆయన అవార్డు అందుకున్నారు.అబ్దుల్ గఫార్ రచనలు అనేక సాహిత్య వేదికల ప్రశంసలను అందుకున్నాయి. దాశరథి సాహిత్యం, గురజాడ లలిత కళావేదిక, తెలంగాణ సాహితి లాటరీ ఫెస్ట్, ప్రపంచ తెలుగు మహాసభలు (2012, 2017), ధర్మకేతన సాహిత్య కళా పీఠం వంటి వేదికల నుంచి ఆయన అనేకఅవార్డులు అందుకున్నారు.మాతృభాష ఉర్దూ అయినప్పటికీ తెలుగు భాషలో కవిత్వం రచిస్తూ సమాజ సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజల్లో చైతన్యం నింపడం ద్వారా అబ్దుల్ గఫార్ సాహిత్య రంగంలో తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆధ్యాత్మిక విలువలు, సాహిత్య సేవలను సమన్వయం చేస్తూ ఆయన కొనసాగిస్తున్న ఈ ప్రయాణం యువతకు స్ఫూర్తి నిస్తోంది.




విశ్రాంతి ఉపాధ్యాయుడు ఎంఎ గఫార్ ను సన్మానిస్తున్న దృశ్యం

## పోతులమడుగులో వివాహానికి హాజరైన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి



పోతులమడుగులో మండల కాంగ్రెస్ సీనియర్ నేత బంధువు వివాహానికి హాజరైన కేసిరెడ్డి ఇతర నాయకులు

**భూత్పూర్,మార్చి 15,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం పోతులమడుగు సూక్యతండాలో ఆదివారం జరిగిన మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్ బావమరిది కుమారుడి వివాహానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,పోతులమడుగు సర్పంచి ఆనందర్‌రెడ్డి ఇతర నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా సన్మాన కార్యక్రమం



గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

**ఉప్పునుంతల,మార్చి 15 ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో విజయవంతంగా భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బంది సహకరించడంతో వారికి శాలువా లు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్,వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీ ఖదీర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



ఖదీర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, మార్చి 15 ప్రభాతవార్త :** బల్మూరు మాజీ ఎంపిటిసి ఖదీర్ ను ఆదివారం టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పరామర్శించారు. ఇటీవల జరిగిన సంఘటనలో ఆసుపత్రి పాలైన మాజీ ఎంపీటీసీ ఖదీర్ చికిత్స పొందుతూ ఇటీవల ఇంటి కి చేరుకోవడంతో ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్ రెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీపతిరావు, కాశన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన దృశ్యం

**దామరగిద్ద, మార్చి 15 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా దామరగిద్ద మండలం మల్రెడ్డి పల్లి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్మికుల సేవలను కొనియాడుతూ వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్వేతా శివకుమార్, ఉప సర్పంచ్ శ్రీ లాలప్ప, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అలాగే గ్రామ వీఓఏ అవుటి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మిత్రపక్షం సీపీఎం నాయకులు శ్రీ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ తదితరులు హాజరై పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందించారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

**కోయిల్‌కొండ మార్చి 15 ప్రభాతవార్త :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు మండల కేంద్రమైన కోయిలకొండ పెద్ద మసీదులో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ నేత వై పవన్ కుమార్ గౌడ్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సోదరా భావంతో మతాలకతీతంగా జరుపుకోవాలని అన్నారు. పవిత్ర రంజాన్ మాసం ముస్లిం సోదరులు ఎంతో సంతోషంగా జరుపుకోవాలని వారికి ముందుగానే పండుగ శుభాకాంక్షలు ఆయన తెలిపారు. అల్లాను స్మరిస్తూ ఉపవాస దీక్షలు చేస్తున్నా ముస్లిం సోదరులకు అల్లా ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సోదర భావానికి ప్రతీక రంజాన్...

**కురాన్ కంఠస్థం చేసిన ఇమామ్ మోజానులకు ఘన సత్కారం..**

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి...**



రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే

**దేవరకద్ర,మార్చి 15 ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ మాసం సోదరభావానికి ప్రతిక అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. రంజాన్ నెలలో ముస్లింలు ఉపవాస దీక్షలు పాటిస్తూ, ఆత్మ శుద్ధి, సహనం, దానధర్మాలు పాటించడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుంది అని తెలిపారు. అన్ని మతాల ప్రజలు పరస్పర ప్రేమ ఐక్యతతో కలిసి జీవించాలని సందేశాన్ని రంజాన్‌పండుగ ఇస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆదివారం దేవరకద్ర మున్సిపాలిటీ లోని జామియా మసీదులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో దేవరకద్ర ఎమ్మెల్యే తో కలిసి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాంతి, సౌభ్రాతృత్వం, సమాజంలో మరింత పెరగాలని ఆకాంక్షి ంచారు. అనంతరం ముస్లిం సోదరులకు ముందుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి, ముస్లిం సోదరులతో కలిసి, ఇఫ్తార్ విందులో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నాను అని దేవరకద్ర ఎమ్మెల్యే అన్నారు. తదనంతరం ఖురాన్ కంఠస్థం చేసిన ఇమామ్,మోజన్లకు శాలువతో ఘనంగా సన్మానించి, వారికి చేతి గడియారాలను బహుమతిగా ఇనాయత్ అలీ,ఎమ్మెల్యేతో కలిసి అందజేశారు. అదేవిధంగా పలువురు నిరుపేదలకు రంజాన్ తోఫా అందజేసిన ఫోటోగ్రాఫర్ అధ్యక్షులు కుష్బూ. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, జాకీర్,దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, ముస్లిం సోదరులు కుష్బూ, ఖాయిూం, ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

**జడ్చర్ల, మార్చి 15 ప్రభాతవార్త:** కేశవ మాధవ ప్రేరణ సమితి మాధవియం జడ్చర్లలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ను నిర్వహించారు. ఈ వైద్య శిబిరమును డా. మధుసూదన్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారుగా వందమందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, గడ్డం బాబు నాయుడు, చిరంజీవి, సంజీవ గురూజీ, కృష్ణమూర్తి, చిక్క ఆంజనేయులు, రవీంద్ర చారి, వాడ్యాల సాయిలు,మరాఠీ నరసింహులు,దినేష్ కుమార్, నాగరాజు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## గ్రామంలో ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు

**దామరగిద్ద, మార్చి 15 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని గత్ప గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ అవిటి మల్లమ్మ ఉగాది, శ్రీరామ నవమి పండుగలను పురస్కరించు కొని గ్రామంలో ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేయించారు. పండుగల సందర్భంగా గ్రామం మొత్తం వెలుగులతో కళకళలాడేలా ప్రత్యేకంగా లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సర్పంచ్ అవిటి మల్లమ్మకు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. పండుగల సందర్భంగా గ్రామంలో ఇలాంటి ఏర్పాట్లు చేయడం వల్ల ఆనంద వాతావరణం నెలకొన్నదని గ్రామస్తులు తెలిపారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

**వెల్దండ, మార్చి 15 ప్రభాతవార్త :** వెల్దండ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డితో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట ప్రజలు ప్రయాణికులు దాహార్తిని తీర్చడానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, ఉప సర్పంచ్ శీను ముదిరాజ్, పంచాయతీ కార్యదర్శి గిరి,వార్డ్ మెంబర్లు కొండయ్య, కిష్టల్, కవిత రమేష్, పిల్లి దేవేందర్, మానస రాజు, శేఖర్, వాణి పురుషోత్తమ చారి, రంగనాథం మల్లీశ్వరి, మారేపల్లి శ్రీను, మసిగుండ్ల వెంకటేష్, కొయ్యల పుల్లయ్య, క్యాసారపు వెంకటయ్య, భయ్య మల్లయ్య, మట్ట నిరంజన్ గౌడ్, మట్ట శేఖర్ గౌడ్, మట్ట భరత్ గౌడ్, శ్రీను, ఎండి బాబా తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక

**రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య యువజన సర్వీసుల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి**

**మక్తల్ టౌన్, మార్చి 15 ప్రభాతవార్త :** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు లో ఆత్మీయత, మతసమరస్యానికి ప్రతీక అని రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మక్తల్ రాయల్ ఫంక్షన్ హాల్ లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా విందులో పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ.. రంజాన్ ముస్లిం సోదరులకు పవిత్ర మాసం అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఆచరించే ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫ్తార్ విందు కుల,మత సామ్రాస్యానికి ప్రతికగా నిలుస్తుంది అన్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ముస్లిం సోదరులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉపవాస దీక్షలో పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముస్లింలలో కూడా చాలామంది బీదవారు ఉన్నారని వారిని అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మైనారిటీ అధికారి రషీద్,ఆల్మేవ చైర్మన్ షేక్ ఫరూక్ హుస్సేన్, బాలకృష్ణ రెడ్డి, కట్టా సూరి, మైనారిటీ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నురుద్దీన్, లాలా,కౌన్సిలర్లు, మౌలానా గులాం, మహమ్మద్ అబ్దుల్, ఖవీ హుసేని, బోయ రవి, సిఐ రామ్‌లాల్, ఎస్సై తహసిల్దార్ సురేష్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

**పాలమూరు రెడ్డి సేవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు**

**మహబూబ్ నగర్, మార్చి 15 ప్రభాతవార్త :** పాలమూరు రెడ్డి సేవ సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకలు మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లు సరస్వతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలని , నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారికి అండగా నిలబడాలని కోరారు. నేటి సమాజంలో మహిళలు ఆకాశమే హద్దుగా ఎదుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా డాక్టర్లు పద్మారెడ్డి, విష్ణుప్రియాంక రెడ్డి, కార్పొరేటర్ మర్రి జ్యోతి, కౌన్సిలర్ మాధవి లను సన్మానించారు. కార్యక్రమంలో లక్కీ మహిళగా తూము నర్మద గెలుపొందారు. మహిళా కార్యవర్గం స్వరూప, శోభ, వరలక్ష్మి, నర్మద, హేమలత, శశికళ, వనజ, అనిత, గీత, సుమతి, విజయలక్ష్మి, జయశ్రీ, అనురాధ, పద్మ, సునీత, కవిత, నిర్మల, వినోద, శ్రీదేవి, రాజేశ్వరి, లలిత సూర్యకళ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు. వేడుకలు: పాలమూరు రెడ్డి సేవ సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకలు మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లు సరస్వతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలని , నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారికి అండగా నిలబడాలని కోరారు. నేటి సమాజంలో మహిళలు ఆకాశమే హద్దుగా ఎదుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా డాక్టర్లు పద్మారెడ్డి, విష్ణుప్రియాంక రెడ్డి, కార్పొరేటర్ మర్రి జ్యోతి, కౌన్సిలర్ మాధవి లను సన్మానించారు. కార్యక్రమంలో లక్కీ మహిళగా తూము నర్మద గెలుపొందారు.మరియు మహిళా కార్యవర్గం స్వరూప, శోభ, వరలక్ష్మి, నర్మద, హేమలత, శశికళ, వనజ, అనిత, గీత, సుమతి, విజయలక్ష్మి, జయశ్రీ, అనురాధ, పద్మ, సునీత, కవిత, నిర్మల, వినోద, శ్రీదేవి, రాజేశ్వరి, లలిత సూర్యకళ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ డా. శ్రీధర్ రెడ్డి ఇకలేరు...

**రాజాపూర్, మార్చి 15 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ రాజాపూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రవి స్క్రాప్ దుకాణం పక్కన వేదశ్రీ క్లినిక్ ను నిర్వహిస్తున్న ఆర్ఎంపీ డా. శ్రీధర్ రెడ్డి మృతి చెందడం బాధాకరమని రాజాపూర్ గ్రామ సర్పంచ్, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ అన్నారు. గత మూడు, నాలుగు రోజుల క్రితం గుండెపోటు రాగా మహబూబ్ నగర్‌లోని ఓ ఆసుపత్రి లో రెండు స్టంట్ లు వేశారని... డిశ్చార్జ్ అయిన శ్రీధర్ రెడ్డి ఆదివారం తన స్వగృహం మల్లేపల్లిలో మృతిచెందడం కలిచి వేసిందన్నారు. ఆయన మృతి తీరనిలోటని శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు.

## ఇఫ్తార్ విందులు మతాల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయి: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**రాజాపూర్, మార్చి 15 ప్రభాతవార్త :** ఇఫ్తార్ విందులు మతాల మధ్య సోదరభావాన్ని పెంచుతాయని,రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు పరస్పర గౌరవం, ఐక్యత,సామరస్యాన్ని బలపరుస్తాయని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాజాపూర్ మండల కేంద్రంలోని మసీదులో కాంగ్రెస్ పార్టీ నాయకులు విక్రమ్ రెడ్డి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజాపూర్ నూతన మసీదు ఏర్పాటు కోసం 30 లక్షల నిధులు రెండు నెలల తర్వాత కేటాయిస్తారని తెలిపారు. ఇఫ్తార్ విందుకు విచ్చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిని ముస్లిం సోదరులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

# ప్రజల భాగస్వామ్యంతో ఆదివారం డ్రై డే కార్యక్రమాలు

**గ్రామాల్లో చెరువులు కుంటలు గుర్తింపు**

**ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు**

**ఉత్సాహంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక**



ప్రజా పాలనలో భాగంగా ఉత్తమ సేవలందించిన వారిని సన్మానించిన దృశ్యం



వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దృశ్యం




పారిశుద్ధ్య కిట్లు అందజేసిన దృశ్యం

**మహబూనగర్ బ్యూరో, మార్చి 15 ప్రభాత వార్త :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ గ్రామీణ ఉపాధి శాఖ ద్వారా ఆదివారం 10 వ రోజు కార్యక్రమాలను జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలో అన్ని గ్రామపంచాయతీలలో డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. మండలాల వారీగా చెరువులు, కుంటలను గుర్తించి వాటినీ శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపర్చేందుకు ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా పారిశుధ్య కార్యకర్తలైన మల్టీ పర్పస్ వర్కర్లకు (ఎం.పీ.డబ్ల్యూ) ఆరోగ్యశిబిరాలు నిర్వహించి,వారి సేవలను గుర్తిస్తూ సన్మాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు.జిల్లాలో మొత్తం 16 మండలాల్లో 423 గ్రామపంచాయతీలలో 1,395 మంది యం.పి.డబ్ల్యూ, లు పనిచేస్తున్నారు. వీరికి సంబంధించి మొత్తం 272 ఆరోగ్య శిబిరాలు నిర్వహించగా, అవి 304 గ్రామపంచాయతీలను కవర్ చేశాయి. ఈ శిబిరాలకు 940 మంది ఎంపీడబ్ల్యూలు హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 402 సన్మాన కార్యక్రమాలు నిర్వహించగా, అవి 388 గ్రామపంచాయతీల్లో జరిగాయి. ఈ కార్యక్రమాల్లో 1,304 మంది యం.పి.డబ్ల్యూ,లను సన్మానించారు. అలాగే వారికి 1,288 యూనిఫామ్‌లు, పారిశుద్ధ్య కిట్లు పంపిణీ చేశారు.

**అడ్డాకల్ మండలంలో** 17 గ్రామపంచాయతీలు ఉండగా, వాటిలో 70 మంది యం.పి.డబ్ల్యూ, లు పనిచేస్తున్నారు. అన్ని గ్రామపంచాయతీలలో ఆరోగ్యశిబిరాలు నిర్వహించగా 70మంది యం.పి.డబ్ల్యూలు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమాలు కూడా అన్ని గ్రామాల్లో నిర్వహించి వారికి యూనిఫామ్‌లు,పారిశుధ్య కిట్లుపంపిణీ చేశారు.

**బాలానగర్ మండలంలో** 37 గ్రామపంచాయతీలుఉండగా,వాటిలో 90మంది యం.పి.డబ్ల్యూ, లు పనిచేస్తున్నారు. అన్ని గ్రామపంచాయతీలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించగా 90 మంది యం.పి.డబ్ల్యూ,లు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమాల్లో వారిని సత్కరించి యూనిఫామ్‌లు, పారిశుద్ధ్య కిట్లు అందజేశారు.

**భూత్పూర్ మండలంలో** 19 గ్రామపంచాయతీలు ఉండగా, వాటిలో 76 మంది యం.పి.డబ్ల్యూ, లు పనిచేస్తున్నారు. ఈ మండలంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించకపోయినా అన్ని గ్రామపంచాయతీలలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించి 76 మంది యం.పి.డబ్ల్యూ,లను సత్కరించి యూనిఫామ్‌లు, కిట్లు పంపిణీ చేశారు.

**సీసీకుంట మండలంలో** 18 గ్రామపంచాయతీలు ఉండగా,వాటిలో 83మంది యం.పి.డబ్ల్యూ,లు పనిచేస్తున్నారు. ఆరోగ్య శిబిరాలు నిర్వహించకపోయినా అన్ని గ్రామపంచాయతీలలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించి 83 మంది యం.పి.డబ్ల్యూ,లను సత్కరించారు.

**దేవరకద్ర మండలంలో** 18 గ్రామపంచాయతీలు ఉండగా,వాటిలో 68 మంది యం.పి.డబ్ల్యూ, లు పనిచేస్తున్నారు. అన్ని గ్రామపంచాయతీలలో ఆరోగ్యశిబిరాలు నిర్వహించగా 68మంది యం.పి.డబ్ల్యూ,లు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమాలు నిర్వహించి వారికి యూనిఫామ్‌లు, పారిశుధ్య కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గడ్డెగూడెం గ్రామపంచాయతీలో ఎంపీబ్ల్యూల సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

**గండీడ్ మండలంలో** 27 గ్రామపంచాయతీలు ఉండగా,వాటిలో 88మంది యం.పి.డబ్ల్యూ,లు పనిచేస్తున్నారు.ఎనిమిది ఆరోగ్యశిబిరాలు నిర్వహించగా 88మంది యం.పి.డబ్ల్యూ,లు పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో సన్మాన కార్యక్రమాలు నిర్వహించి వారిని సత్కరించారు.

**హన్వాడ మండలంలో** 35 గ్రామపంచాయతీలు ఉండగా,వాటిలో 112మంది యం.పి.డబ్ల్యూ,లు పనిచేస్తున్నారు. 32 ఆరోగ్య శిబిరాలు నిర్వహించగా 67 మంది యం.పి.డబ్ల్యూ,లు హాజరయ్యారు. సన్మాన కార్యక్రమాల్లో 83 మంది యం.పి.డబ్ల్యూ,లను సత్కరించి 81 యూనిఫామ్‌లు ,పారిశుధ్య కిట్లు పంపిణీ చేశారు.

**జడ్చర్ల మండలంలో** 45 గ్రామపంచాయతీలు ఉండగా,వాటిలో 132 మంది యం.పి.డబ్ల్యూ, లు పనిచేస్తున్నారు. 31 ఆరోగ్య శిబిరాలు నిర్వహించగా 88 మంది యం.పి.డబ్ల్యూ,లు పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో సన్మాన కార్యక్రమాలు నిర్వహించి 132 మంది యం.పి.డబ్ల్యూ, లను సత్కరించారు. అలాగే 126 యూనిఫామ్‌లు మరియు పారిశుధ్య కిట్లు పంపిణీ చేశారు.

**కోయిల్‌కొండ మండలంలో** 44 గ్రామపంచాయతీలుండగా,వాటిలో 141మంది యం.పి.డబ్ల్యూ, లు పనిచేస్తున్నారు. ఈ మండలంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించలేదు. అయితే 19 గ్రామపంచాయతీలలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించి 85 మంది యం.పి.డబ్ల్యూ,లను సత్కరించారు.

కౌకుంట్ల మండలంలో 12 గ్రామపంచాయతీలు ఉండగా, వాటిలో 36 మంది యం.పి.డబ్ల్యూ, లు పనిచేస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించగా 36 మంది యం.పి.డబ్ల్యూ,లు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమాలు నిర్వహించి 30 మంది యం.పి.డబ్ల్యూ,లను సత్కరించారు. అలాగే వెంకటగిరి గ్రామపంచాయతీలో ఆరోగ్య పరీక్షలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

**మహబూబ్‌నగర్ మండలంలో** 24 గ్రామపంచాయతీలు ఉండగా,వాటిలో 90 మంది యం.పి.డబ్ల్యూ,లు పనిచేస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించగా 90 మంది యం.పి.డబ్ల్యూ,లు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమాల్లో వారిని సత్కరించి యూనిఫామ్‌లు, పారిశుధ్య కిట్లు పంపిణీ చేశారు.

**మిడ్జిల్ మండలంలో** 24 గ్రామపంచాయతీలు ఉండగా, వాటిలో 83 మంది యం.పి.డబ్ల్యూ, లు పనిచేస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించగా 83మంది యం.పి.డబ్ల్యూ,లు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమాల్లో వారిని సత్కరించి యూనిఫామ్‌లు పారిశుద్ధ్య కిట్లు పంపిణీ చేశారు.

**మొహమ్మదాబాద్ మండలంలో** 22 గ్రామపంచాయతీలు ఉండగా,వాటిలో 79మంది యం.పి.డబ్ల్యూ,లు పనిచేస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించగా 79 మంది యం.పి.డబ్ల్యూ, లు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమాల్లో వారిని సత్కరించి యూనిఫామ్‌లు, పారిశుధ్య కిట్లు పంపిణీ చేశారు.

**ముసాపేట్ మండలంలో** 15 గ్రామపంచాయతీలు ఉండగా, వాటిలో 63 మంది యం.పి.డబ్ల్యూ,లు పనిచేస్తున్నారు. ఆరోగ్య శిబిరాలు నిర్వహించకపోయినా అన్ని గ్రామాల్లో సన్మాన కార్యక్రమాలు నిర్వహించి వారిని సత్కరించారు.

**నవాబ్‌పేట్ మండలంలో** 42 గ్రామపంచాయతీలుండగా,వాటిలో 117మంది యం.పి.డబ్ల్యూ, లు పనిచేస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించగా 117 మంది యం.పి.డబ్ల్యూ, లు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమాల్లో వారిని సత్కరించి 103 యూనిఫామ్‌లు మరియు పారిశుధ్య కిట్లు పంపిణీ చేశారు.

**రాజాపూర్ మండలంలో** 24 గ్రామపంచాయతీలు ఉండగా, వాటిలో 67 మంది యం.పి.డబ్ల్యూ,లు పనిచేస్తున్నారు. ఐదు ఆరోగ్య శిబిరాలు నిర్వహించగా 64 మంది యం.పి.డబ్ల్యూ,లు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమాల్లో 67 మంది యం.పి.డబ్ల్యూ,లను సత్కరించి యూనిఫామ్‌లు, పారిశుధ్య కిట్లు పంపిణీ చేశారు.

# 2027 జనాభా లెక్కలు దేశాభివృద్ధికి కీలకం

**-జనగణన విధులను పక్కాగా నిర్వహించాలి : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 15 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లాలో జన గణన విధులను అధికారులు పక్కాగా నిర్వహించాలని, అప్పుడే జిల్లాలోని ఆయా వర్గాల ప్రజలకు భవిష్యత్తులో కల్పించాల్సిన మౌళిక సదుపాయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వం ఒక అవగాహనకు వచ్చి కార్యాచరణను అమలు చేసేందుకు ఆస్కారం ఉంటుందని, 100 శాతం జనగణన చేయాలని అధికారులను నాగర్‌కర్నూల్ జిల్లాకలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు.జన గణనన 2027 పురస్కరించుకుని జనాభా లెక్కల సేకరణ ప్రక్రియలో భాగస్వాములయ్యే తహసీల్దార్లు, మండల విద్యాధికారులు, మండల స్థాయి సెన్సెస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిటిలు, అన్ని శాఖల జిల్లా అధికారులకు ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో 2027 జన గణనపై జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో అధికారులకు మొదటి విడత జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. నేటి ఆదివారం నుంచి ఈ నెల 17 వరకు మూడు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుండగా, హైదరాబాద్ నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్‌లుసెన్సెస్ జెయింట్ డైరెక్టర్ బి లాజర్, మాస్టర్ ట్రైనర్ శివరామకృష్ణ, రాజేశ్వర్ టెక్నికల్ సపోర్ట్ టీమ్ మెంబర్స్ జనాభా లెక్కల గణనపై అధికారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించనున్నారు. జనాభా గణన కోసం ఎలా సన్నద్ధం కావాలి, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ 2011 లో చివరిసారి జనాభా గణన జరిగిందని గుర్తు చేశారు. వాస్తవానికి 2021 లో ఈ ప్రక్రియను చేపట్టాల్సి ఉండగా, కరోనా తీవ్రత వల్ల నిర్వహించలేదని అన్నారు. ప్రస్తుతం తొలిసారిగా సాంకేతికతను వినియోగిస్తూ, డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ జరిపేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తొలి దశలో నివాస గృహాలతో పాటు అన్ని రకాల కట్టడాలు, కుటుంబ వివరాలను సేకరించడం జరుగుతుందని, రెండో విడతలో వ్యక్తిగత వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. దేశంలోనే తొలిసారి పూర్తిగా డిజిటల్ విధానం ద్వారా జన గణన జరపాల్సి ఉంటుందన్నారు.జన గణనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై వాస్తవ వివరాలు వెల్లడించాలని సూచించారు. ఏ ఒక్కరి వివరాలు సైతం ఎక్కడ కూడా బయటికి వెల్లడి కావని, నేరుగా సర్వర్ లో నిక్షిప్తం అయ్యేలా సాంకేతికతను వినియోగిస్తున్నారని అన్నారు.ఈసారి సెల్ఫ్ డిక్లరేషన్ ఎంతో ముఖ్యమని, అధికారులు, ఎన్యుమరేటర్లు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. చార్జ్ ఆఫీసర్లు ప్రతిరోజూ జన గణన ప్రక్రియను సమీక్షించాలని, తాము కూడా క్షేత్ర స్థాయి రోజువారీగా పర్యవేక్షణ జరుపుతామని అన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందితో నిర్దేశిత గడువు లోపు జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను మెరుగైన రీతిలో పూర్తి చేసేలా సన్నద్ధం చేయాలన్నారు. ప్రణాళికల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు దోహదపడే జన గణన ప్రక్రియను నిబద్ధత, అంకితభావంతో నిర్వహించాలని కలెక్టర్ హితవు పలికారు. మొదటి దశలో నిర్వహించే ఇళ్ల జాబితా, గృహాల గణనలో ఇంటి నిర్మాణం, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు,తాగునీటి సౌకర్యం,మురుగు నీటిపారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో,టెలివిజన్,స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలపై మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరిస్తారని కలెక్టర్ తెలిపారు. గణన ప్రక్రియను సజావుగా నిర్వహించేలా అధికారులు మూడు రోజుల శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా పరిషత్ సీఈవో దేవ సహాయం, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సుజాత, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)



వ్యాధిగ్రస్తులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీహరి

కృషి చేస్తున్నారని ఆయన అభినందించారు. ఉదండాపూర్ రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులకు అదనపు పరిహారం అందించడంలో ఎమ్మెల్యే పాత్ర ముఖ్యమని తెలిపారు. కొడంగల్-నారాయణపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు త్వరలో పూర్తవు తాయని మంత్రి చెప్పారు. భూసేకరణ పూర్తయ్యిందని, పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని అన్ని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రా జెక్టులు పూర్తైతే ప్రతి ఎకరా భూమికి సాగునీరు అందించి మహబూ బ్‌నగర్‌జిల్లా పచ్చని వ్యవసాయ ప్రాంతంగా మారుతుందని అన్నా రు.జడ్చర్ల ఏరియా ఆసుపత్రినీ గత ప్రభుత్వంలో ఉన్న నేతలు అనాలోచితంగా లోతట్టు ప్రాంతంలో నిర్మించడంతో ఆసుపత్రికి సరైన యాక్సెస్ రోడ్డు లేకుండాపోయిందని, సరైన వర్షపునీటి డ్రైనే జ్ లేకపోవడం వల్ల వర్షాకాలంలో ఆసుపత్రి పరిసరాలు నీట మునగ డం జరుగుతుందని అన్నారు. త్వరలో ఆసుపత్రికి వెళ్లడానికి సరైన యాక్సెస్ రోడ్ ఏర్పాటు చేస్తామని, దానితోపాటు సమీపంలో ఉన్న డ్రైనేజ్ కాలువను పునర్నిర్మించి వరద, మురుగు నీరు ఆసుపత్రిలోకి రాకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు ఆసుపత్రిలో తగిన సిబ్బందిని కూడా నియమిం చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆసుపత్రిని సందర్శించి వైద్య సిబందితో మాట్లాడారు. గత నెలలో ఆసుపత్రిలో నిర్వహించిన ప్రసవాల సంఖ్య గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి అధికారులు గత నెలలో మొత్తం 79 ప్రసవాలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో 57 సాధారణ ప్రసవాలు, 22 సిజేరియన్ (సి సెక్షన్) ప్రసవాలు జరిగినట్లు వివరించారు. అలాగే ఆసుపత్రిలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది సరిపడా ఉన్నారా, అవసరమైన మందుల నిల్వలు సరిపడా ఉన్నాయా లేవా అనే విషయాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా వైద్య అధికారి డా.కృష్ణ, ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ అర్షదుల్లా, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులకు ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తానని చెప్పి ఉన్న పెన్షన్స్ సరిగ్గా ఇవ్వడం లేదని, కళ్యాణ లక్ష్మి పథకం కింద ఇచ్చే లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి అసలు కే మోసం చేస్తుందన్నారు. పేదలు పెళ్లి చేసి కళ్యాణ లక్ష్మి కోసం ఎదు రుచూలు స్తున్నారు పెళ్లి చేసుకున్న దంపతులకు పిల్లలు పుట్టి నడుస్తు న్నా నేటికీ తులం బంగారం లేదు లక్ష రూపాయలు లేవని పేర్కొన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నోమోసాలు చేస్తూ ఉందన్నారు. గ్రామాలలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇస్తున్న ఇండ్లను ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అర్హులైన పేదలకు ఇవ్వకుండా కేవలం కాంగ్రెస్‌కార్యకర్తలు వారి అనుచరులకే ఇండ్లను కేటాయించిస్తున్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు వారికి అవకాశం వచ్చినప్పుడు గత ప్రభుత్వానికి ఏ విధమైన గుణపాఠం చెప్పిండ్రు రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా అదే జరుగుతుందని హెచ్చరించారు. ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ లో భాగంగా ఈనెల తొమ్మిది నుంచి 24 వరకు క్రీడాకారులు నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని కల్పించేందుకు ప్రధాన మంత్రి సంసద్ కీలనే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని, ఈ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యంగా కబడ్డీ వాలీబాల్ కోకో క్రికెట్ క్రీడల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఒక గొప్ప అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

క్రీడా మహోత్సవం..ఏప్రిల్ 9 నుండి 24 వరకు ఈ క్రీడా మహోత్సవాలు జరుగుతాయి కావున ఆసక్తి ఉన్న ప్రతి క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొని తమ యొక్క నైపుణ్యతను ప్రదర్శించి బహుమతులను గెల్పొందాల్సిందిగా కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొంగు గంగన్న, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ కే సతీష్ కుమార్, సీనియర్ నాయకులు ,మాజీ ఎంపీటీసీ సభ్యులు కోడూరు రాజు గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ గౌడ్ ,మాజీ మండల ప్రధాన కార్యదర్శి శశిధర్ రెడ్డి ,దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు , రమేష్ నాయక్ ,అంజి పాల్గొన్నారు.

## అల్లా దీవెనలు అందరిపై ఉండాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 15 ప్రభాతవార్త:**అల్లా దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చేసే కఠోర ఉపవాస దీక్షలు ఫలించాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 24వ వార్డు కౌన్సిలర్ నిజాం ఆధ్వర్యంలో స్థానిక మదార్సాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులకు ఇఫ్తార్‌ను విడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే అల్లా బోధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. అల్లా బోధనలు సమాజానికి ఆదర్శమైనవి, సర్వమతాలను సమానంగా చూసేదే కాంగ్రెస్ పార్టీ అన్నారు. సమాజం బాగుండాలని ప్రకృతి కరుణించాలని ముస్లిం సోదరులు చేస్తున్న కఠోర ఉపవాస దీక్షలు ఫలించాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైన పెద్దదిగా భావించే రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా కుటుంబ సభ్యులతో కలిసిమెలసి జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

